తోడేరు గ్రామం కాదు.. నా కుటుంబం: కాకాణి పూజిత



03

అక్షర దర్శిని

RNI: APTEL/26/A8235

జాతీయ తెలుగు దినపత్రిక

అక్షర దర్శిని

దినపత్రికలో పని చేయడానికి అనుభవం కలిగిన, జర్నలిజంపై ఆసక్తి ఉన్న రిపోర్టర్లు కావలెను. కొత్త వారికి కూడా అవకాశం ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

9912808090

8374168090

నెల్లూరు | సంపుటి - 1 | సంచిక -35 | బుధవారం 04 నవంబర్ 2026 | ఎడిటర్: కడియాల చిన్నయరెడ్డి | పేజీలు : 4 | వెల : 2/-



- కూటమి ప్రభుత్వం హామీల అమలులో విఫలం.. ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపు ఉన్నారన్న మాజీ మంత్రి
- కార్యకర్తలకు అండగా ఉంటా.. ే ఎదల భూములను కాపాడే బాధ్యత నాదే



కరప్షన్ కింగ్.. సోమిరెడ్డి చాప్టర్ క్లోజ్: కాకాణి

వెంకటాచలం,(అక్షర దర్శిని): సర్వేపల్లి నియోజకవర్గంలో అవినీతి రాజకీయాలకు ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని, సోమిరెడ్డి చాప్టర్ క్లోజ్ కానుందని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వెంకటాచలం మండలం చెముడుగుంట పంచాయతీ పరిధిలోని నక్కల కాలనీలో మంగళవారం జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయన కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.ఈ సందర్భంగా జడ్పీటీసీ అభ్యర్థి దక్కిలి వెంకట రమణమ్మ, చెముడుగుంట ఎంపీటీసీ అభ్యర్థి గంగాల మంజుల విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ల కాలంలో అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చామని కాకాణి పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.1,500 ఆర్థిక సాయం, నిరుద్యోగులకు నెలకు రూ.3,000 భృతి, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేల సాయం వంటి హామీల అమలుపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల అమలులోనూ లోపాలు ఉన్నాయని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, కాపు నేస్తం, నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా, వైఎస్సార్ ఆసరా, వాహన మిత్ర వంటి పథకాల ద్వారా వివిధ వర్గాలకు ఆర్థిక సహాయం అందించామని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం అభివృద్ధి కంటే ప్రతిపక్షంపై విమర్శలకే ప్రాధాన్యత ఇస్తోందని వ్యాఖ్యానించారు.

పేదల భూములకు అండగా ఉంటా.. ఈ ప్రాంతంలో గతంలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం లేఅవుట్ సిద్ధం చేసి పట్టాలు అందించినప్పటికీ, కోర్టు కేసుల కారణంగా ప్రక్రియ నిలిచిపోయిందని కాకాణి తెలిపారు. ఆ సమస్యల పరిష్కారానికి వ్యక్తిగతంగా కృషి చేసి అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కొందరు నాయకులు పేదలకు చెందిన భూములను ఆక్రమించి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ, అటువంటి వారికి ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటా.. అధికారం ఉందనే అహంకారంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టినా, బెదిరింపులకు పాల్పడినా సహించబోనని కాకాణి హెచ్చరించారు. పార్టీ శ్రేణులకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా అండగా నిలబడి పోరాడతానని భరోసా ఇచ్చారు. ప్రచారంలో కరపత్రాలు చించివేయడం, కావాలనే గొడవలు సృష్టించి పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేయడం వంటి చర్యలతో తమను భయపెట్టలేరని అన్నారు.సోమిరెడ్డి కార్యక్రమాలకు ప్రజలు స్వచ్ఛందంగా రావడం లేదని, జనసమీకరణలో వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్‌సీపీపై నిందలు వేస్తున్నారని కాకాణి విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై ప్రజలకు ఉన్న అభిమానమే తమ ప్రచార కార్యక్రమాలకు వస్తున్న స్పందనకు కారణమన్నారు. గత ఎన్నికల్లో జరిగిన పొరపాటును సరిదిద్దుకోవాలని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 79 ఎంపీటీసీ స్థానాలు, ఐదు జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతికూల పరిస్థితుల్లోనూ ధైర్యంగా పోరాడుతున్నారని అభినందించారు. చెముడుగుంట ఎంపీటీసీ అభ్యర్థి గంగాల మంజులను గెలిపిస్తే మండల పరిషత్ నిధుల ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తారని తెలిపారు.



జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అయిన తర్వాత మంజులమ్మను వెంటబెట్టుకుని ఈ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పట్టాల పంపిణీతో పాటు అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాలు అందించిన వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలా, హామీలు ఇచ్చిన కూటమికి మద్దతు ఇవ్వాలా అన్నది ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని కాకాణి విజ్ఞప్తి చేశారు.

పొదలకూరులో రెపరెపలాడిన పసుపు జెండా.. కదం తొక్కిన టీడీపీ శ్రేణులు!



- పరిషత్ ఎన్నికల ప్రచార ముగింపు సందర్భంగా భారీ ర్యాలీ..
- అభివృద్ధికి పట్టం కట్టండి.. టీడీపీని ఆదరించండి
- ఫలితాలు ఏకపక్షంగా ఉండాలి..
- 19 మంది ఎంపీటీసీలతో పాటు జడ్పీటీసీ అభ్యర్థిని గెలిపించాలి
- ప్రచార ముగింపు సభలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పిలుపు

పొదలకూరు,(అక్షర దర్శిని): పరిషత్ ఎన్నికల ప్రచార ముగింపు సందర్భంగా పొదలకూరులో తెలుగుదేశం పార్టీ శ్రేణులు భారీ ప్రదర్శనతో హోరెత్తించాయి. పట్టణంలోని రాంనగర్ గేట్ సెంటర్ నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పసుపు జెండాలు రెపరెపలాడుతుండగా, పార్టీ శ్రేణులు కదం తొక్కుతూ ర్యాలీని ఉత్సాహంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ప్రచార ముగింపు సభలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధికి పట్టం కట్టి తెలుగుదేశం పార్టీని ఆదరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పరిషత్ ఎన్నికల్లో ఫలితాలు ఏకపక్షంగా ఉండాలని, పొదలకూరు మండల జడ్పీటీసీ అభ్యర్థి కలిచేటి ప్రభాకర్ రెడ్డితో పాటు మండలంలోని 19 మంది ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఉన్న ఐదు ఎంపీపీ స్థానాలు, ఐదు జడ్పీటీసీ స్థానాలతో పాటు అన్ని ఎంపీటీసీ స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణ, కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తమ విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు.







వావిలేరులో కూటమి అభ్యర్థి విజయానికి ప్రచారం

▶▶ ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసిన మాజీ సర్పంచ్ గోనుగుంట రాంబాబు

చేజర్ల,(అక్షర దర్శిని): మండలంలోని వావిలేరు గ్రామంలో జడ్పీటీసీ కూటమి అభ్యర్థి రావి మల్లీశ్వరి విజయాన్ని కాంక్షిస్తూ మాజీ సర్పంచ్ గోనుగుంట రాంబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు.ఈ సందర్భంగా కూటమి అభ్యర్థి రావి మల్లీశ్వరికి మద్దతుగా సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామంలో ప్రజలను నేరుగా కలుసుకుంటూ అభ్యర్థి తరఫున ఓట్లు అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎన్నికల ప్రచారాన్ని ఉత్సాహంగా కొనసాగించారు.

నెల్లూరు కార్పొరేషన్‌లో కూటమి విజయప్రభంజనం..

▶▶ ప్రత్యర్థులు వాషౌట్

▶▶ కూటమి వర్ణశోభితం -గోమతి నగర్ క్యాంపు ఆఫీస్‌లో అంబరాన్నంటిన సంబరాలు





నెల్లూరు, అక్షర దర్శిని :నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల్లో కూటమి పార్టీ విజయప్రభంజనం సృష్టించింది..ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా అన్ని డివిజన్లలో విజయం సాధిస్తూ క్లీన్ స్వీప్ దిశగా అడుగులు వేస్తోంది. పార్టీ సాధించిన ఈ ఘన విజయంపై కూటమి శ్రేణుల్లో ఉత్సాహం ఉప్పొంగిపోతోంది.?ఈ సందర్భంగా గోమతి నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో సంబరాలు ఆంబరాన్నంటాయి. రాష్ట్ర మంత్రి నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితో పాటు రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, నారాయణ కుటుంబ సభ్యులు సతీమణి రమాదేవి, కుమార్తెలు షరిణి, సింధు అందరూ ఒకే వేదికపైకి వచ్చి ఈ అద్భుత విజయాన్ని వేడుకగా జరుపుకున్నారు.క్యాంపు కార్యాలయంలో టీడీపీ విజయోత్సవ పాటలు మార్మోగుతుండగా నేతలు, కుటుంబ సభ్యులు ఎంతో ఉత్సాహంగా డాన్సులు చేస్తూ ఆనందాన్ని పంచుకున్నారు.ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ, పసుపు వర్ణంలో మునిగిపోయిన వాతావరణంలో ఈ చారిత్రాత్మక విజయాన్ని ఘనంగా ఆస్వాదించారు.

బుచ్చి మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ఘన విజయం

▶▶ ఎంపీ వేమిరెడ్డి రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిలకు అభ్యర్థుల కృతజ్ఞతలు

బుచ్చి, శుభోదయం సింహపురి (ప్రతినిధి):బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి అభ్యర్థులు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన దొడ్ల విజయలక్ష్మి, 26వ వార్డు కౌన్సిలర్‌గా విజయం సాధించిన నిడిగుంట శ్రావణి ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు.మున్సిపల్ ఎన్నికల్లో తమ విజయానికి మద్దతుగా నిలిచి అన్ని విధాలా సహకరించినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేశారు. నెల్లూరులోని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నివాసంలో ఈ భేటీ జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సముద్రంలో గల్లంతైన ఐదుగురు మత్స్యకారులు క్షేమం





▶▶ కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన మెరైన్ పోలీసులు, రెవెన్యూ అధికారులు..

▶▶ సురక్షితంగా కృష్ణపట్నం పోర్టుకు తరలింపు

నెల్లూరు,(అక్షర దర్శిని):సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన ఐదుగురు మత్స్యకారులు సురక్షితంగా బయటపడటంతో వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశాలతో మెరైన్ పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో చేపట్టిన గాలింపు చర్యలు ఫలించడంతో ఐదుగురిని క్షేమంగా రక్షించారు.వివరాల్లోకి వెళితే.. ప్రకాశం జిల్లా చీరాల మండలం ఓడూరు గ్రామానికి చెందిన పిక్కి అప్పలరాజుకు చెందిన ఫిషింగ్ బోటు (నంబరు: xచీణ-ూ్రా1 మీ 3025 0001) గత నెల 29వ తేదీన ఐదుగురు మత్స్యకారులతో కలిసి చేపల వేటకు సముద్రంలోకి వెళ్లింది. అయితే నిర్ణీత సమయానికి బోటు తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన బోటు యజమాని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం మెరైన్ పోలీసులు, ముత్తుకూరు మండల తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో పెట్రోలింగ్ బోటు ద్వారా సముద్రంలో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సముద్రంలో చిక్కుకుపోయిన ఐదుగురు మత్స్యకారులను గుర్తించి సురక్షితంగా రక్షించారు. అనంతరం వారిని కృష్ణపట్నం పోర్టుకు తీసుకువచ్చి, మెరైన్ డీఎస్పీ పర్యవేక్షణలో సీవీఆర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వారి స్వస్థలాలకు పంపించే ఏర్పాట్లు చేశారు.

రక్షించబడిన మత్స్యకారులు వీరే..

గరికాన కోదండ (30), మారడ జగన్నాథం (40), యరిపిల్లి రమణ (50), సొరడ పోలరాజు (30), జి. అప్పారావు (60)లను అధికారులు సురక్షితంగా రక్షించారు. వీరిలో కొందరు తుని, కాకినాడ ప్రాంతాలకు చెందినవారు కాగా, కొంతకాలంగా చీరాల మండలం ఓడూరు గ్రామంలో నివాసం ఉంటున్నారు.సకాలంలో స్పందించి సమన్వయంతో గాలింపు, రక్షణ చర్యలు చేపట్టి ఐదుగురు మత్స్యకారుల ప్రాణాలను కాపాడిన మెరైన్ పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ప్రత్యేకంగా అభినందించారు.

కలువాయి అభివృద్ధికి కృషి చేస్తాం



▶▶ జడ్పీటీసీ అభ్యర్థి ఆరవ లిఖిత.. కుల్లూరులో కూటమి అభ్యర్థుల ఇంటింటి ప్రచారం

కలువాయి,(అక్షర దర్శిని):కలువాయి మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి ఆరవ లిఖిత తెలిపారు. మండలంలోని కుల్లూరు గ్రామంలో జనసేన ఎంపీటీసీ అభ్యర్థి మాలే రామారావుతో కలిసి మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. టీడీపీ సైకిల్ గుర్తుకు, జనసేన గాజు గ్లాస్ గుర్తుకు ఓట్లు వేసి తమను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం అభ్యర్థులు మాట్లాడుతూ.. కలువాయి మండల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ప్రచారానికి గ్రామ ప్రజల నుంచి లభించిన స్పందనతో కూటమి నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మనోహర్, రమేష్, టీడీపీ నాయకులు రవి, వెంకటేశ్వర్లు, రాజేష్, వెంకట సుబ్బయ్యతో పాటు వెంకటరెడ్డిపల్లి, కుల్లూరు, రాజుపాలెం గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తోడేరు గ్రామం కాదు.. నా కుటుంబం: కాకాణి పూజిత








- తోడేరు గ్రామం కాదు.. నా కుటుంబం: కాకాణి పూజిత
- గ్రామ ఐకమత్యాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు మంచివి కావు
- ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి ఉండాలి.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

పొదలకూరు,(అక్షర దర్శిని):తోడేరు గ్రామం తనకు కేవలం సొంత గ్రామం మాత్రమే కాదని, తమ కుటుంబంతో విడదీయలేని అనుబంధం కలిగిన ఇల్లులాంటిదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత అన్నారు. గ్రామంలో ఇన్నాళ్లుగా కొనసాగుతున్న ఐకమత్యాన్ని దెబ్బతీసేలా కొందరు విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నించడం మంచిది కాదని హితవు పలికారు.పొదలకూరు మండలం తోడేరు పంచాయతీలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. తన సొంత గ్రామమైన తోడేరులో ప్రతి ఇంటికీ వెళ్లి గ్రామస్తులను ఆప్యాయంగా పలకరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ అభ్యర్థి బచ్చల సురేష్ కుమార్‌రెడ్డి, తోడేరు ఎంపీటీసీ అభ్యర్థి అట్ల రవీంద్రను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గ్రామానికి చేరుకున్న కాకాణి పూజితకు ప్రజలు ఘన స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన తండ్రి ద్వారా సర్వేపల్లి ప్రాంతంతో కుటుంబ అనుబంధం ఏర్పడితే, తన తాతయ్య ద్వారా తోడేరు గ్రామంతో ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడిందన్నారు. మనిషి ఎంత ఎత్తుకు ఎదిగినా చివరకు తన సొంత గూటికి చేరుకోవాల్సిందేనని, తనకు తోడేరు గ్రామం అలాంటి ఆత్మీయతను పంచే సొంత ఇల్లుతో సమానమని భావోద్వేగంగా పేర్కొన్నారు.తనకు ఊహ తెలిసినప్పటి నుంచి తోడేరు గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల పేరుతో గొడవలు, విభేదాలు చూడలేదని, గ్రామస్తులంతా ఒక కుటుంబంలా కలిసిమెలిసి జీవించేవారని గుర్తుచేశారు. తన తాతయ్య, తండ్రి కూడా గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో ఉండాలని ఆకాంక్షించేవారని తెలిపారు. ఒకరినొకరు పేరుపెట్టి ఆప్యాయంగా పలకరించుకునేంత అనుబంధం ఈ గ్రామ ప్రజల మధ్య ఉందన్నారు.అయితే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం గ్రామంలో పోటీలు, విభేదాలు సృష్టిస్తూ ఇన్నాళ్లుగా కొనసాగుతున్న ఐకమత్యాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయని, కానీ గ్రామ ప్రజల మధ్య ఉండే ఆత్మీయత, అనుబంధం శాశ్వతంగా ఉండాలని అన్నారు.తాను గ్రామానికి కేవలం ఓట్లు అడగడానికి రాలేదని, గ్రామ ప్రజలందరినీ ఒకసారి కలుసుకుని తమ మధ్య ఉన్న అనుబంధం ఎప్పటికీ అలాగే ఉంటుందని తెలియజేయడానికి వచ్చానని చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గ్రామ ప్రజలకు తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తోడేరు గ్రామ ప్రజలందరూ ఒకే కుటుంబంలా కలిసిమెలిసి ఉంటారనే నమ్మకం తనకు ఉందని, ఎంపీటీసీ అభ్యర్థి అట్ల రవీంద్ర విజయంపై ధీమా వ్యక్తం చేశారు.నవంబర్ 5న జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గం పరిధిలో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న ఐదుగురు జడ్పీటీసీ, 79 మంది ఎంపీటీసీ అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా జడ్పీటీసీ అభ్యర్థి బచ్చల సురేష్ కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ అభ్యర్థి అట్ల రవీంద్రను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.గ్రామ ఐకమత్యం, ప్రజల మధ్య ఆత్మీయతే తోడేరు ప్రత్యేకత అని, ఆ సంప్రదాయం భవిష్యత్తులోనూ కొనసాగాలని కాకాణి పూజిత ఆకాంక్షించారు.

మురసు తుఫాన్ తో కదిలిన యంత్రాంగం




- విద్యుత్ మరమ్మతులకు యుద్ధప్రాతిపదికన చర్యలు
- మనుబోలుకు చేరుకున్న కర్నూలు విద్యుత్ శాఖ ప్రత్యేక బృందం

మనుబోలు, (అక్షర దర్శిని):మురసు తుఫాన్ ప్రభావంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. తుఫాన్ కారణంగా విద్యుత్ స్తంభాలు విరిగిపోవడం, విద్యుత్ లైన్లు దెబ్బతినే అవకాశం ఉండటంతో మరమ్మతు పనులను వేగవంతం చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా కర్నూలు నుంచి 20 మంది సభ్యులతో కూడిన విద్యుత్ శాఖ ప్రత్యేక బృందం సోమవారం రాత్రి మనుబోలుకు చేరుకుంది.తుఫాన్ ప్రభావం నెల్లూరు జిల్లాపై పెద్దగా లేకపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఒంగోలు వద్ద తుఫాన్ తీరం దాటడంతో నెల్లూరు జిల్లాకు ముప్పు తప్పిందని అధికారులు తెలిపారు. దీంతో ముందస్తు మరమ్మతు చర్యలతో పాటు గతంలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించే పనులపై ప్రత్యేక బృందం దృష్టి సారించింది.మనుబోలు సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు చేపట్టడంతో పాటు మనుబోలు నుంచి నెల్లూరుకు విద్యుత్ సరఫరా చేసే లైన్లలో గతంలో దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి మరమ్మతులు చేపట్టారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.ఈ సందర్భంగా ఏఈ అనిల్ కుమార్ మాట్లాడుతూ మురసు తుఫాన్ కారణంగా విద్యుత్ స్తంభాలు విరిగిపోవడం, విద్యుత్ లైన్లు దెబ్బతినే అవకాశం ఉందని ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా కర్నూలు నుంచి మరమ్మతు పనులు చేపట్టేందుకు ప్రత్యేక బృందాన్ని పంపించిందని తెలిపారు.అయితే తుఫాన్ ప్రభావం నెల్లూరు జిల్లాపై పెద్దగా లేకపోవడంతో ప్రస్తుతం గతంలో దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులను చేపట్టినట్లు వివరించారు. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ ప్రత్యేక బృందంలో కర్నూలుకు చెందిన ఈఈ డీఎన్ విజయరాజు, ఏఈ ఎం. గోపాల్ రాజు, ఏడీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.







సర్వేపల్లిలో ఐదు జెడ్పీటీసీలు, ఐదు ఎంపీపీలు మావే!

- ప్రజల మద్దతుతో భారీ విజయాలు సాధిస్తాం.. మనుబోలు ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి

మనుబోలు,(అక్షర దర్శిని):సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రజల మద్దతుతో ఐదు జెడ్పీటీసీ స్థానాలతో పాటు ఐదు ఎంపీపీ స్థానాలను కూటమి కైవసం చేసుకుంటుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఆయన ప్రజలను కోరారు.మనుబోలు మండలంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో జెడ్పీటీసీ అభ్యర్థి పొట్టేళ్ల ప్రసాద్, మనుబోలు-1 ఎంపీటీసీ అభ్యర్థి సాని భారతి, మనుబోలు-2 ఎంపీటీసీ అభ్యర్థి ఉదయ్‌లకు మద్దతుగా సోమిరెడ్డి ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ అభ్యర్థికి సైకిల్ గుర్తుపై, ఎంపీటీసీ అభ్యర్థి ఉదయ్‌కు గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, పొట్టేళ్ల ప్రసాద్ ఉన్నత విద్యావంతుడని, దళితులకు జరిగిన అన్యాయాలపై గతంలో ధైర్యంగా పోరాడారని పేర్కొన్నారు. వీరంపల్లిలో దళితులను గ్రామం నుంచి వెళ్లగొట్టిన ఘటనలో బాధితులకు న్యాయం జరిగేలా ప్రసాద్ కృషి చేశారని చెప్పారు. గిరిజన యువకుడికి సంబంధించిన షిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగం విషయంలోనూ పోరాటం చేసి విజయం సాధించారని వివరించారు. ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న ప్రసాద్‌ను జెడ్పీటీసీగా గెలిపించాలని కోరారు.తాను నిధులు తీసుకొచ్చి పనులు ప్రారంభించిన దేగపూడి--బండేపల్లి కాలువ నిర్మాణాన్ని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అడ్డుకున్నారని సోమిరెడ్డి ఆరోపించారు. ఈ విషయంలో మనుబోలు మండల రైతులకు కాకాణి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కొమ్మలపూడిలో జాతీయ రహదారి పక్కన ఉన్న విలువైన భూముల వ్యవహారం, వీరంపల్లిలో హైస్కూల్ స్థలానికి సంబంధించిన వివాదాలపైనా ఆయన విమర్శలు చేశారు.వైసీపీ ఐదేళ్ల పాలనలో చోటుచేసుకున్నాయని తాను ఆరోపిస్తున్న అక్రమాలు, భూదోపిడీలు, అక్రమ మైనింగ్ తదితర అంశాలను ప్రజలు గమనించారని సోమిరెడ్డి అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపిన ప్రజలు, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసేందుకు కూటమి అభ్యర్థుల విజయానికి సహకరించాలని కోరారు.

నేడు, రేపు పాఠశాలలు యథావిధిగా నిర్వహణ

▶▶ ఎన్నికల విధులకు నియమితులైన సిబ్బంది విధులకు హాజరు కావాలి



నెల్లూరు అక్షర దర్శిని :నెల్లూరు నగరపాలక సంస్థ పరిధితో పాటు కావలి, గూడూరు, ఆత్మ కూరు మున్సిపాలిటీలు, బుచ్చిరెడ్డిపాలెం, అల్లూరు నగర పంచాయతీల పరిధిలోని అన్ని పాఠశాలలు నవంబర్ 4, 5 తేదీల్లో యథావిధిగా పనిచేస్తాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆమోదంతో జిల్లా విద్యాశాఖ అధికారి డా. రాజా బాలాజీ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు ప్రాంతాల్లోని పాఠశాలల్లో బోధనా కార్యక్రమాలు ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగించేందుకు మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల విధులకు నియమితులైన ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది మాత్రం తమకు కేటాయించిన ఎన్నికల విధులకు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, పాఠశాలల నిర్వహణలో ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పోలింగ్ రోజు నవంబర్ 5న బ్యాంకులకు సెలవు

▶▶ బ్యాంకు ఉద్యోగుల హర్షం

▶▶ ఎల్డీఎం విజ్ఞప్తికి కలెక్టర్ సానుకూల స్పందన



తిరుపతి అక్షర దర్శిని :నవంబరు 5న పోలింగ్ రోజున నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ (ఎన్ఐ) చట్టం కింద తిరుపతి జిల్లా వ్యాప్తంగా సెలవు ప్రకటించినందుకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారికి బ్యాంకు ఉద్యోగులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, ఎస్ఎల్బీసీ ఉత్తర్వులకు అనుగుణంగా జిల్లా మొత్తానికి సెలవు ప్రకటించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ గుంటూరు రవి కుమార్ కలెక్టర్ గారిని కలిసి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో బ్యాంకు సిబ్బంది మైక్రో అబ్జర్వర్లుగా ఎన్నికల విధులకు నియమితులైన నేపథ్యంలో.. అనేక బ్యాంకు శాఖల్లో సాధారణ కార్యకలాపాలు నిర్వహించడం కష్టతరమవుతుందని వివరించారు. కొందరికి పొరుగు జిల్లాల్లో ఓటు హక్కు ఉందని తెలిపారు. సెలవు ప్రకటించడంతో సిబ్బంది ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కలుగుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎల్డీఎం, పలు బ్యాంకుల యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఉద్యోగుల తరపున కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

పోస్టల్ బ్యాలెట్ కు 75 మంది ఓటింగ్

మనుబోలు అక్షర దర్శిని :మనుబోలు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. రెండో రోజు 39 మంది తమ ఓటును వినియోగించుకున్నారని ఆర్వో రాజశేఖర్ రెడ్డి తెలిపారు.ఎన్నికల విధులకు ఎంపికైన ఉద్యోగులు, అంగన్వాడి కార్యకర్తలు వి ఏఏ లు ఉపాధ్యాయులకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో జప్తిటిసి స్థానానికి మొత్తం 75 మంది మంది,ఎంపీటీసీ స్థానాలకు 75 మంది పోస్టల్ బ్యాలెట్ను వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి రాజశేఖర్ రెడ్డి తెలిపారు.అసిస్టెంట్ ఎన్నికల అధికారి జలజాక్షి,ఏవో ముజీబున్నీసా,జూనియర్ అసిస్టెంట్ రమేష్ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. బుధవారం ఐదు గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకోవచ్చని ఎన్నికల అధికారి తెలిపారు.కాగా పోస్టల్ బ్యాలెట్ ఎన్నిక సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్ఐ మహమ్మద్ హానీఫ్ సిబ్బందితో భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ కూటమిదే విజయం: సోమిరెడ్డి









▶▶ అభివృద్ధి చేసి ఓట్లు అడుగుతున్నాం.. ప్రజాదరణతో భారీ మెజారిటీ ఖాయం

▶▶ కాకాణి విమర్శలకు ఘాటు కౌంటర్ ఇచ్చిన సర్వేపల్లి ఎమ్మెల్యే

వెంకటాచలం,(అక్షర దర్శిని):మున్సిపల్ ఎన్నికల్లోనే కాకుండా రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులకు ప్రజల మద్దతు ఉందని, భారీ మెజారిటీతో విజయం సాధించబోతున్నామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజల నుంచి ఎదురవుతున్న వ్యతిరేకతను తట్టుకోలేక విమర్శలకు దిగుతున్నారని ఆరోపించారు.వెంకటాచలం మండలంలో మంగళవారం నిర్వహించిన కూటమి ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని, జడ్పీటీసీ అభ్యర్థి దారా అన్నమ్మతో పాటు ఎంపీటీసీ అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల్లో కూటమి మంచి ఫలితాలు సాధిస్తోందని, పులివెందుల, పుంగనూరు సహా పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజల నుంచి ఆదరణ తగ్గిందని వ్యాఖ్యానించారు. ఇదే తరహా ఫలితాలు రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ పునరావృతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.సర్వేపల్లి నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులే తనకు ఎన్నికల్లో ప్రధాన బలమని పేర్కొన్నారు. సుమారు 7,200 ఎకరాలకు సంబంధించి దళిత, గిరిజన రైతులకు సీజేఎఫ్ఎస్ పట్టాలను రద్దు చేయించి డీకేటీ పట్టాలు ఇప్పించామని, తద్వారా వారికి యాజమాన్య హక్కులు లభించాయని తెలిపారు. రైతులు అన్నదాత సుఖీభవ వంటి పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్నారని వివరించారు. వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో జిల్లా వ్యాప్తంగా సుమారు 70 వేల మంది రైతులకు ప్రయోజనం చేకూర్చడం సంతోషకరమన్నారు.వెంకటాచలం మండలంలో రూర్బన్ పథకం కింద రూ.100 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పొదలకూరులో కండలేరు ఎడమ కాలువ లిఫ్ట్, సామాజిక ఆరోగ్య కేంద్రం, మెగా మినరల్ వాటర్ ప్లాంట్, సోమశిల దక్షిణ కాలువ, ఐటీఐ, నిమ్మ మార్కెట్ యార్డు, చెక్‌డ్యాంల నిర్మాణం వంటి పనులు చేపట్టామని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడు మండలాల ప్రజలకు ఉపయోగపడేలా డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయించామని, రోగుల సౌకర్యార్థం రూ.2 కోట్లతో ఏసీ బ్లాక్ నిర్మించనున్నట్లు వెల్లడించారు.

కాకాణిపై విమర్శలు..

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తనపై చేస్తున్న విమర్శలకు స్పందిస్తూ.. గతంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను అడ్డుకున్న చరిత్ర ఆయనదేనని సోమిరెడ్డి ఆరోపించారు. దక్షిణ కాలువ పనులు, మెగా మినరల్ వాటర్ ప్లాంటు, అన్న క్యాంటీన్ విషయంలో ఆయన వ్యవహారశైలిపై విమర్శలు చేశారు. మనుబోలు మండల రైతుల చిరకాల కోరిక అయిన డేగపూడి–బండేపల్లి కాలువ పనులను తాము ప్రారంభించేందుకు ప్రయత్నించగా, కమీషన్ల కోసం కాకాణి అడ్డుకున్నారని ఆరోపించారు.వెంకటాచలం ప్రాంతంలో ఈదగాలి పెద్దరెడ్లతో కలిసి రూ.53 కోట్ల విలువైన గ్రావెల్‌ను అక్రమంగా తరలించారంటూ ఆరోపణలు చేశారు. విజిలెన్స్ నోటీసుల అనంతరం కోర్టును ఆశ్రయించారని, మరో కేసులోనూ రూ.11 కోట్ల జరిమానా చెల్లించకుండా న్యాయస్థానాన్ని ఆశ్రయించారని పేర్కొన్నారు. ఈ వ్యవహారాలపై న్యాయపోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.
కసుమూరులో ప్రభుత్వ భూములు, మరుపూరులో 57 ఎకరాల భూములు, రామదాసుకండ్రిగలో భూముల వ్యవహారాలకు సంబంధించి కూడా పలు ఆరోపణలు చేశారు. పొదలకూరులో పంచాయతీ నిధుల దుర్వినియోగం జరిగిందంటూ వాకాటి శ్రీనివాసులురెడ్డిపై విమర్శలు గుప్పించారు. రుస్తుం మైన్ వ్యవహారంలోనూ గతంలో జరిగిన పరిణామాలను ప్రస్తావించారు.రాజకీయాల్లో నియంతృత్వ ధోరణులు, బెదిరింపులు విడనాడాలని ప్రత్యర్థి వర్గాలకు హితవు పలికారు. చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి ధైర్యంగా ఓట్లు అడుగుతున్నామని, ప్రజల మద్దతుతో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం, కూటమి అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని సోమిరెడ్డి ప్రజలను కోరారు.

నెల్లూరులో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రారంభం





▶▶ డీకేడబ్ల్యూ కళాశాలలో స్ట్రాంగ్ రూముల సీలు తొలగించి కౌంటింగ్ షురూ..

▶▶ తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు

నెల్లూరు, శుభోదయం సింహపురి (ప్రతినిధి):నెల్లూరు నగరపాలక సంస్థతో పాటు బుచ్చిరెడ్డిపాలెం, ఆత్మకూరు మున్సిపాలిటీల ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది.నెల్లూరులోని డీకేడబ్ల్యూ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో స్ట్రాంగ్ రూముల సీలు తొలగించి, ఎన్నికల పరిశీలకురాలు సదా భార్గవి సమక్షంలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్ కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభించారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించారు. అనంతరం నిబంధనల ప్రకారం ఓట్ల లెక్కింపును కొనసాగించారు.నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల కౌంటింగ్ కోసం మొత్తం 19 గదుల్లో ఏర్పాట్లు చేశారు.ప్రతి గదిలో ఏడు టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేయగా, ఐదు టేబుళ్లను కార్పొరేటర్ అభ్యర్థుల ఓట్ల లెక్కింపునకు, మరో రెండు టేబుళ్లను మేయర్ అభ్యర్థుల ఓట్ల లెక్కింపునకు కేటాయించారు.నగరపాలక సంస్థ పరిధిలో ఎన్నికలు జరిగిన 64 డివిజన్లకు సంబంధించిన కార్పొరేటర్ ఓట్ల లెక్కింపును నాలుగు రౌండ్లలో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించారు.మొదటి మూడు రౌండ్లలో 19 డివిజన్ల చొప్పున, చివరి రౌండ్‌లో మిగిలిన ఏడు డివిజన్ల ఓట్లను లెక్కించేలా ఏర్పాట్లు చేశారు.మేయర్ అభ్యర్థుల ఓట్ల లెక్కింపునకు కూడా 19 గదుల్లో రెండు చొప్పున టేబుళ్లను ఏర్పాటు చేశారు. నాలుగు రౌండ్లలో మొత్తం 144 టేబుళ్ల ద్వారా ఓట్ల లెక్కింపు నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను చేపట్టారు.నెల్లూరు నగరపాలక సంస్థలో మొత్తం 72 డివిజన్లు ఉండగా, వాటిలో ఎనిమిది డివిజన్లు ఏకగ్రీవమయ్యాయి. దీంతో మిగిలిన 64 డివిజన్లకు ఎన్నికలు నిర్వహించారు.బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీలోని 28 వార్డుల్లో ఐదు ఏకగ్రీవం కాగా, మిగిలిన 23 వార్డులకు పోలింగ్ జరిగింది. ఆత్మకూరు మున్సిపాలిటీలో మొత్తం 28 వార్డులకు గాను ఒక వార్డు ఏకగ్రీవమైంది.మిగిలిన 27 వార్డులకు ఎన్నికలు నిర్వహించారు. మూడు పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై అభ్యర్థులు, రాజకీయ పార్టీల నేతలు, ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

Publisher, Editor & Owned by: KADIYALA CHINMAYA REDDY, Thatiparthi Village, Podalakur Mandal, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524309. Printed by: VIJAYA GRAPHICS, D.No. 26-3-1993. Chandramouli Nagar, 1st Steet Veda Yapalem, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524004.